రమాయణం

**ఒక్క సినిమా కష్టాల్లోనే కాదు.. గప్పాలు కొట్టడంలోనూ అనసూయ అతిగానే ఉండేది. వేడుకల్లో కీచుగొంతుకతో పాటలు పాడుతుండేది. నలుగురూ కూర్చుని మాట్లాడుతున్నప్పుడు మధ్యలో దూరి.. 'అంతే! నాకు కూడా అంతే! మా ఇంట్ల కూడా అంతే!' అంటూ తల తినేసేది.**

# అతి అనసూయ-2



పద్మ పెళ్లయ్యాక మా కజిన్స్ యూత్ అందరం కలిసి.. భోనగిరి దగ్గరి ఆత్మకూరులోని పద్మవాళ్ల అత్తవారింటికి వెళ్లాం. ఆరోజు వాళ్లింట్లో వ్రతం. భోజనాలు అయిన తర్వాత మమ్మల్ని వాళ్ల మామిడితోటకు తీసుకెళ్లారు. అది చాలాపెద్ద అందమైన తోట. చెట్లకు గుత్తులు గుత్తులుగా మామిడిపండ్లు వేలాడుతుంటే.. చూడ్డానికి భలే బాగుంది. మేమంతా తోటలో తిరిగి కాసేపు ఎంజాయ్ చేశాం. ఇంతలో మధ్యలోని ఖాళీ స్థలంలో చాపలు, జంపఖానాలు పరిచి.. వధూవరులతో బిందెలో ఉంగరాలు తీయించడం వంటి వేడుకలు జరిపించారు. దానిని 'ఊష్మి' అనేవారు. అదంతా పూర్తయిన తర్వాత కొద్దిమంది పాటలు పాడారు. మా కజిన్లలో కొందరు ఎంకి పాటలు, ఇంకొందరు సినిమా పాటలు, జానపద గేయాలు అద్భుతంగా పాడేవారు. అయితే, ఎవరైనా పాటలు బాగా పాడగలిగిన వాళ్లనే.. పాడమని బతిమిలాడుతారు. మనకు అందులో ప్రవేశం లేదు కాబట్టి.. మేమంతా ఎంజాయ్ చేస్తూ చూస్తున్నాం.

ఇంతలో సడన్‌గా ఒక కీచుగొంతు మా పక్కనే ఉన్న గుంపులోంచి వినిపించింది. ''నన్ను విడిచి పోతివా నా నాథా! నట్టడవిలోనా.. ఆఆఆ! నట్టడవిలోనా! లోపమేదీ లేదూ నా నడవడిలోనా.. ఆఆఆ!''.. అంటూ రకరకాల స్థాయిల్లో ఆ పాట సాగిపోతున్నది. శ్రుతీ – లయా ఏ మాత్రం పట్టించుకోకుండా.. తనదైన శైలిలో, కీచుగొంతుతో దాదాపు ఏడుస్తున్నట్టుగా సాగుతున్న ఆ పాట పాడుతున్నావిడ అనసూయగా గుర్తించాం. మేం ఎంత ఆపుదామనుకున్నా.. ఆవిడ ఆపలేదు సరికదా, మరింత తారస్థాయిలో పాడటం మొదలుపెట్టింది. అబ్బాయి తరపువాళ్లంతా.. ''ఈమె ఎవరురా బాబూ? ఎక్కడినుంచి పట్టుకొచ్చిన్రు?!'' అంటూ అడగడం, ''పెండ్లిపిల్ల వాండ్ల దిక్కట!'' అంటూ గుసగుసలాడ్డం మొదలుపెట్టారు. పెళ్లికొడుకూ, పెళ్లికూతురూ బిక్కమొహాలేసి దిక్కులు చూడటం మొదలుపెట్టారు. కొద్దిసేపటికి ఒకావిడ ఎలాగో ధైర్యం చేసి.. ఆమెను ఆపి, ఉపద్రవం నుంచి అందర్నీ తప్పించింది.

అంతేకాదు, ఎక్కడైనా నలుగురు కూర్చుని మాట్లాడుతున్నారంటే.. మధ్యలో దూరిపోయేది. ఎవరైనా, ఏదైనా విషయం చెప్పారంటే అంతే! అనసూయ అందుకొని.. ''నాకు కూడా అంతే! మా ఇంట్ల కూడా అంతే! మా తమ్ముడు కూడా అంతే! మా చెల్లె అంతే! గిట్లనే అంటది. మా తమ్ముడు గూడ గిట్లనే మంచిగ చదువుతడు!'' అంటూ ఉండేది.

ఓసారి టీవీలో శోభనాయుడు శాస్త్రీయ నృత్యం చూస్తున్నాం. అప్పుడు అనసూయ కూడా మాతోబాటే టీవీ చూస్తున్నది. శోభనాయుడు రెండు చేతుల్లోనూ దీపపు ప్రమిదలు ఉంచుకుని, పళ్లెంపై నృత్యం చేస్తూ ఉంటే.. అంతా లీనమై చూస్తున్నాం. అనసూయ సడన్‌గా.. ''మేం గూడా ఎంకటాద్రిపేట గుల్లె గిట్లనే.. మా ఈడు పిల్లలమంత గల్సి రెండు శేతులల్ల దీపాలు పెట్కోని డ్యాన్సు జేసెటోళ్లం. ఊరోళ్లంత ఒచ్చి సూద్దురు!'' అన్నది. ''ఆఁ'' అంటూ దిమ్మెరపోయాం మేమంతా. ''అవును! నిజంగ! ఇగ కొన్ని దినాలైతె తాంబాలం తోటి గూడ జేసేదే ఉండె. కానీ, గంతల్నె నా పెండ్లి అయింది!'' అన్నది సిగ్గుపడుతూ. 'ఎంతో కృషితో, ఎన్నో ఏళ్ల అనుభవంతో తప్ప సాధ్యం కాని శాస్త్రీయ నృత్యం విషయంలో కూడా డంబాలా? ఇది క్షమించరాని నేరం!' అనుకున్నాం. వెంటనే లోపలికి వెళ్లి ఒక తాంబాలం తెచ్చి.. ''అబ్బ! ఇప్పుడు చెయ్యవా! మేం కూడ చూస్తం.. ప్లీజ్!'' అన్నాం. ''ఏ! గిప్పుడెట్ల? అన్ని మర్సిపోయిన గాదు. అయ్యో! నా బతుకు నన్ను బతుకనిచ్చిండా? నా సావు నన్ను సావనిచ్చిండా?!'' అంటూ.. తన బ్రాండ్ ఏడుపులోకి ప్రవేశించి తప్పించుకుంది. మేం ఆమె గురించి చెప్పుకోవాలంటే.. 'ఎ.ఎ. (అతి అనసూయ)' అని చెప్పుకొనేవాళ్లం కోడ్ భాషలో.

**ఓసారి టీవీలో శోభనాయుడు శాస్త్రీయ నృత్యం చూస్తున్నాం. అప్పుడు అనసూయ కూడా మాతో బాటే టీవీ చూస్తున్నది. శోభనాయుడు రెండు చేతుల్లోనూ దీపపు ప్రమిదలు ఉంచుకుని, పళ్లెంపై నృత్యం చేస్తూ ఉంటే.. అంతా లీనమై చూస్తున్నాం. అనసూయ సడన్‌గా..**

కొన్నాళ్లకు ఆవిడ హనుమకొండకు షిఫ్ట్ అయ్యింది. అప్పుడప్పుడు మాత్రమే వస్తూ పోతూ ఉండేది. మరికొన్నాళ్లకు రాకపోకలు చాలా తగ్గిపోయాయి. తను ఎక్కడుందో కరెక్ట్ అడ్రెస్ కూడా తెలియలేదు. చాలా రోజులకు ఎవరో చెప్పారు.. అనసూయ చనిపోయిందని! ఆఖరి రోజుల్లో క్యాన్సర్‌తో బాధపడిందని తెలిసి.. 'అయ్యో! తను ఎక్కడుందో తెలిస్తే ఆఖరు రోజుల్లోనైనా చూసేవాళ్లం' అనుకున్నాం అమ్మా, మేమూ! ■



**నెల్లుట్ల రమాదేవి**
**రచయిత్రి**